క్లుప్తంగా

సీఎంను కలిసిన కోలా గురువులు



కోలా గురువులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

మహారాణిపేట : విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనడానికి విచ్చేసి రాడిసన్ హోటల్లో బస చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీగా ఎంపికైన రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలా గురువులను సీఎం సత్కరించారు.

గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచండి



లైబ్రరీని శుభ్రం చేస్తున్న గ్రంథాలయాధికారి రాజు, పాఠకులు

అల్లిపురం: చదువుల లోగిలి గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అల్లిపురం శాఖా గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెల మొదటి శనివారం మనం–మన గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయాన్ని పాఠకులు, సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పుస్తకాలు, ర్యాక్‌లతో పాటు గ్రంథాలయంలోని దుమ్ము, ధూళి శుభ్రపరిచి పాఠకులను ఉత్తేజపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మనం–మన గ్రంథాలయం కార్యక్రమం ద్వారా గ్రంథాలయాలను శుభ్రపరిచే అవకాశం అందరికీ కలిగిందన్నారు. దేవాలయంతో సమానమైన సరస్వతీ నిలయాలు గ్రంథాలయాలు అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కుమారి, జయలక్ష్మి, పాఠకులు పాల్గొని అన్ని విభాగాలను శుభ్రపరిచారు.

క్రైస్తవ సంస్థల ఆస్తులు కాపాడండి



మాట్లాడుతున్న వరప్రసాదరావు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీబీసీఎన్‌సీ, డబ్ల్యూఎంఈకి చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పి. వరప్రసాదరావు కోరారు. నగరంలో గల సంస్థ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో విలువైన భూముల్ని ఒక ప్రభుత్వ ఉద్యోగి మరొక వ్యక్తితో కలిసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. క్రిస్టియన్, మైనార్టీ భూముల పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్తామని చెప్పారు.

నేటి నుంచి 'వైజాగ్ టాలెంట్' పోటీలు

డాబాగార్డెన్స్: జీ–20 సదస్సు నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల 'వైజాగ్ గాట్ టాలెంట్' పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు తెలిపారు. ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత గుడి ఎదురుగా గల బీచ్‌లో ప్రతి రోజూ సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు పోటీలు ఉంటాయని చెప్పారు. డ్యాన్స్, సింగింగ్, మ్యూజిక్, మిమిక్రీ, స్పెషల్ ఆర్ట్స్‌లో ఈ పోటీలు ఉంటాయని, పాల్గొనేవారు 98857 75677 వాట్సాప్‌కు పూర్తి వివరాలు పంపాలన్నారు. ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు.

సమ్మిట్ సందడి

- రెండో రోజు అదే జోష్
- జీఐఎస్ సదస్సు విజయవంతం



సచివాలయ సిబ్బంది సెల్ఫీ

ఏయూక్యాంపస్: విశాఖ వేదికగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో రోజు శనివారం విజయవంతంగా ముగిసింది. సదస్సులో పాల్గొనడానికి ఉదయం నుంచి పెద్దసంఖ్యలో పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

ప్రవేశ మార్గం వద్ద ప్రతీ ఒక్కరిని గుర్తింపు కార్డులు, క్యూఆర్ కోడ్‌ను పరిశీలించి లోపలికి అనుమతించారు. సదస్సు ప్రాంగణంలో పోలీసులు బాంబ్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. సదస్సు నిర్వహణలో ఎటువంటి భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా పోలీసులు ప్రశంసనీయ పాత్ర పోషించారు.

సదస్సు విజయవంతం

రెండు రోజుల జీఐఎస్ సదస్సు పూర్తి స్థాయిలో విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు రెండో రోజు సైతం హాజరయ్యారు. విభిన్న వేదికలపై ఏకకాలంలో పెట్టుబడులకు సంబంధించి పారిశ్రామిక వేత్తలు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. వచ్చిన లక్ష్యం నెరవేరడంతో సదస్సుకు వచ్చిన పారిశ్రామిక వేత్తల్లో జోష్ కనిపించింది. పలువురు పారిశ్రామిక వేత్తలు సదస్సు ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టడానికి యువత రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం స్టాల్ మంచి ఆదరణ పొందింది. వార్డు/గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రత్యేకతలను వివిధ దేశాల ప్రతినిధులకు సిబ్బంది వివరించారు. ఏపీలో సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతినిధులు ప్రశంసించారు.

విద్యార్థుల సందడి

సదస్సులో రెండో రోజున విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. దీంతో ఏయూతో పాటు నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో జరుగుతున్న ఎంవోయూలు, సెషన్స్‌ను వీక్షించడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఆసక్తి చూపారు. దీంతో సమ్మిట్ ప్రాంగణం విద్యార్థులతో కళకళలాడింది. మేనేజ్‌మెంట్, టెక్నాలజీ రంగాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విదేశీ విద్యార్థులు సైతం హాజరయ్యారు.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు వస్తున్న ప్రతినిధులు

నెట్‌వర్క్ డెవలప్‌మెంట్

విభిన్న రంగాలలో పనిచేస్తున్న నిపుణులు తమ నెట్‌వర్క్‌ను డెవలప్ చేసుకోవడానికి ఈ సదస్సును వేదికగా మలుచుకున్నారు. విభిన్న సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, నిర్వాహకులతో కలసి మాట్లాడారు. తాము పనిచేస్తున్న రంగాలను ఆయా సంస్థలతో అనుసంధానించే దిశగా చర్చలు జరిపారు. పరోక్షంగా అనేకమంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ సదస్సు ఒక మంచి వేదికగా నిలచి వారి పరిధిని విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది.

భారతీయ కళలకు ఫిదా

పలువురు భారతీయ కళలకు ఫిదా అయ్యారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణ నుంచి శ్రావ్యంగా వచ్చే సంగీతాన్ని వింటూ విదేశీయులు తన్మయత్వానికి లోనయ్యారు. సర్వసిద్ధి లక్ష్మణ స్వామి బొబ్బిలి వీణపై శ్రావ్యంగా స్వరాలను పలికిస్తుంటే విదేశీయులు తమ సెల్‌ఫోన్లతో వీటిని చిత్రీకరించారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. యలమంచిలికి చెందిన జయవాణి అక్కడిక్కడే తాటాకుతో దండలు తయారు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. తోలు బొమ్మలు, హస్తకళా రూపాలు, చేనేత వస్త్రాలను చూడడానికి భారతీయులతో పాటు, విదేశీయులు ఆసక్తి చూపారు.



విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఔత్సాహికులు



బొబ్బిలి వీణను కెమెరాలో బంధిస్తున్న విదేశీయులు

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉమావతి, నాగేశ్వరరావు

మహారాణిపేట : బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం పలువురు వైద్యులు పలు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం కార్యక్రమంలో భాగంగా శనివారం నాల్గవ రోజు ప్రపంచ హెల్త్ సంస్థ వైద్యురాలు డాక్టర్ ఉమావతి, జిల్లా విస్తరణ మీడియా అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మహారాణిపేట, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాలను, అపోలో ఆస్పత్రిలో ఉన్న స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ నిర్ధారణ చేయరాదని ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ సమత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలి



టౌన్‌కొత్తరోడ్డు వద్ద చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: పరిశుభ్రతే లక్ష్యంగా పారిశుధ్య సిబ్బంది పని చేయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. శనివారం జీవీఎంసీ జోన్ పరిధిలో గల పూర్ణామార్కెట్, పాతపోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలను భాగస్వాములను చేసినప్పుడే పరిశుభ్రత సాధ్యమవుతుందన్నారు. వార్డుల్లో ఎక్కడా చెత్త లేకుండా చూసుకునే బాధ్యత సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే అన్నారు. క్లాప్ వాహనాలు కచ్చితంగా ప్రతి ఇంటికి తిరిగితే బయటికు చెత్త రాదన్నారు. సెక్రటరీలు వాహనాల బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం వార్డులోని ప్రధాన రహదారుల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

700 రోజులకు చేరుకున్న దీక్షలు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌ను విక్రయిస్తామని చెప్పి ఏడు వందల రోజులైనా మోదీ ప్రభుత్వం ఒక్క శాతం కూడా ఆ పని చేయలేకపోయిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ జేఏసీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు అన్నారు. దీనికి ప్రధాన కారణం అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ప్రజలు పోరుబాట పట్టడమే అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా చేస్తున్న దీక్షలు 700వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ ఉత్పత్తులు తగ్గించి నష్టాల్లో నడుస్తున్నట్లు చూపించాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ ఉత్పత్తిని ఆపేసారని, రోలింగ్ మిల్‌ను కూడా స్తంభింపజేసి నష్టాల్లోకి నెట్టేస్తున్నారని అన్నారు. దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు డిజిన్వెస్ట్‌మెంట్‌కు గురయ్యాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఒక్క శాతం కూడా డిజిన్వెస్ట్‌మెంట్‌కు గురి కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అప్పారావు, ఆర్కే ఎస్‌వీకుమార్, మన్మథరావు, వెంకటరెడ్డి, రాజు, నూకరాజు, లక్ష్మి, జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవాలి

డాబాగార్డెన్స్: ప్రజాస్వామ్య వాదులంతా న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవడానికి ముందుకు రావాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం న్యాయవ్యవస్థ స్వతంత్రత–సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు టీవీ రామాంజనేయులు మాట్లాడుతూ న్యాయవ్యవస్థను లొంగదీసుకోడానికి మోదీ ప్రభుత్వం చేపడుతున్న కుటిల యత్నాలను దుయ్యబట్టారు. గొప్పగొప్ప న్యాయకోవిదులు ఎంతో శ్రమించి దూర దృష్టితో భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని ఇప్పుడు రాజ్యాంగబద్ధంగా ఎన్నికై రాజ్యాంగానికి కట్టుబడి ఉండి, దానిని అమలు చేస్తానని ప్రమాణం చేసిన దేశ ఉపరాష్ట్రపతే రాజ్యాంగ వ్యవస్థ మౌలిక సూత్రాలను సవాలు చేయడం శోచనీయమన్నారు. తాజాగా రిటైర్ అవుతున్న జడ్జీలకు గవర్నర్ పదవులను ఎరగా చూపి ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న జడ్జీలను తమకు అనుకూలంగా వ్యవహరించేటట్టు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇది న్యాయవ్యవస్థపై ప్రజలకు గల విశ్వాసాన్ని దెబ్బ తీస్తుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య వాదులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎస్. వెంకటేశ్వరరావు, నర్రా శ్రీనివాసరావు, సీహెచ్ ఆనందరెడ్డి పాల్గొన్నారు.

'ఆడపిల్లలను కాపాడుకుందాం'



కొబ్బరితోట యూపీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి మహలక్ష్మి



కొబ్బరితోట యూపీహెచ్‌సీలో అవగాహన కలిగిస్తున్న దృశ్యం

అల్లిపురం: 'ఆడపిల్లలను కాపాడుకుందాం.. సృష్టిని రక్షిద్దాం'అనే నినాదంతో శనివారం ఉదయం కొబ్బరితోట అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ఆశ వర్కర్లు సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీసీ అధికారి లోవరాజు, యూపీహెచ్‌సీ వైద్యాధికారి మహలక్ష్మి పాల్గొని ముందుగా అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఆడపిల్లలను చదివించటం ద్వారా వారి భవిష్యత్తును మెరుగుపరచవచ్చన్నారు. అనంతరం బేటీ బచావో–బేటీ పడావో అంటూ నినాదాలు చేస్తూ కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డాబాగార్డెన్స్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్, జన శిక్షణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో గల బ్రిడ్జి స్కూల్ ఆవరణలో మహిళలకు స్వయం ఉపాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మహిళలకు ఫినాయిల్, కొవ్వొత్తులు, సర్ఫ్ తయారీలో ఉచిత శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అందుకు ఇటువంటి స్వల్పకాలిక శిక్షణ దోహదపడుతుందన్నారు. ఇక్కడ తయారైన వస్తువులు సగం ధరకే విక్రయిస్తున్నామని, గత 15 ఏళ్లుగా మహిళలు, బాలల అభ్యున్నతికి నిరంతరం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హోమియో సీనియర్ వైద్యుడు మోటూరి శివరామకృష్ణ, కరుణ, హరగోపాల్, నరసింహారావు, సూర్యనారాయణ, లక్ష్మి, రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

వారంలో రెండు రోజులు వ్యాక్సినేషన్ తప్పనిసరి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. తాటిచెట్లపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వ్యాక్సిన్ కోసం వచ్చిన పిల్లల తల్లిదండ్రులకు వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతను డీఎంహెచ్‌వో తెలియజేశారు. టీకాలు వేయించుకోవాల్సిన పిల్లల జాబితా, వ్యాక్సినేషన్ నిమిత్తం సెషన్ ప్లానింగ్, శిశువుల జాబితా తయారు చేసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్ క్యారియర్‌లో ఐస్ ప్యాక్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి ఐసీడీఎస్ సిబ్బందికి మధ్యాహ్న భోజన పథకంలో అందించే పోషకాహారం గురించి వివరించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రంలో పిల్లల వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

కిటకిటలాడిన బల్లిగిరి దేవాలయం



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము 5 గంటల నుంచి స్వామి వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ఆరాధన, భక్తుల గోత్ర నామాలతో అర్చనలు, నివేదన, మంగళాశాసనము, నీరాజనము, మంత్ర పుష్పం అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

వెంకటాద్రికి ఉచిత బస్సు సౌకర్యం



బస్సుకి పూజ చేస్తున్న అంబికా గణేష్, ప్రధానార్చకుడు రామానుజమ్

సింహాచలం: పెందుర్తిలోని వెంకటాద్రికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం భక్తుడు, అంబికా స్వీట్స్ అధినేత గణేష్ కొత్త బస్సు కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి శనివారంతో పాటు ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో భక్తు లను వెంకటాద్రిపైకి ఉచితంగా తీసుకెళ్లి తీసుకువస్తారు. వెంకటాద్రిపై శనివారం బస్సుకు ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు. అనంతరం అంబికా స్వీట్స్ అధినేత గణేష్ బస్సును ప్రారంభించారు. ప్రధానార్చకుడు రామానుజమ్ మాట్లాడుతూ వెంకటాద్రికి భక్తుల రద్దీ విశేషంగా పెరగడంతో బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే వెంకటాద్రిపై జరిగే విశేష ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు కూడా బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు.

సీతంరాజుతో పట్టభద్రుల సమస్యల పరిష్కారం

జగదాంబ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీగా తమ ఓటు వేసి గెలిపించాలని జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం స్ప్రింగ్‌రోడ్డులో పట్టభద్రుల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల సమస్యలు సీతంరాజు సుధాకర్‌తోనే పరిష్కారం అవుతాయన్నారు.



స్ప్రింగ్‌రోడ్డులో ప్రచారం చేస్తున్న కనకరెడ్డి